# పునర్మూల్యాంకనం

చీకటి పడి చాలా సేపయింది.

ప్రపంచకంలో వున్న బాధంతా తనకే కలుగుతోందన్న ఉక్రోషం వేధిస్తోంది మమతని.

మమత ఏడుస్తోంది. తలచుకున్న కొద్దీ దుఃఖం పొంగుకొస్తోంది.

ఇవ్వాళ మధ్యాహ్నం బాస్‌తో తన సమస్యని ప్రస్తావించింది. ఉద్యోగిగా, గృహిణిగా తన కష్ట పరంపరల్ని చెప్పుకుంది. వారాంతాల్లో హైదరాబాద్ ప్రయాణాల్తో మూడేళ్ళ నుంచీ పడుతున్న అవస్థని వివరించింది. పిల్లలిద్దర్నీ అమ్మ దగ్గర విశాఖలో వదిలి ఆమెకు కలిగిస్తున్న ఇక్కట్లనీ తెలిపింది. భర్త ఉద్యోగం భాద్యతల్నీ కొన్ని ఘోషించింది. ట్రాన్స్‌ఫర్‌ని వేడుకుంది.

విన్నాడు. సగం గ్లాసు నీళ్ళు తాగేడు. ఓరగా చూశాడు. విరిగిన కొమ్మలా సీట్లో నుంచీ టేబుల్ మీదకి ఒరిగాడు. ఠక్కున "ఐడోంట్ లైక్ దిస్" అన్నాడు. పేరు భిక్షపతి. నిలువెత్తు దుర్మతి! విస్తుపోయి చూసింది.

"యస్. ఆడిట్ వస్తోంది. సూపర్‌వైజర్‌గా యూ ఆర్ నెగ్లిజెంట్. సెక్షన్ పరిస్థితేం బాలేదు. అన్నీ ఎరియర్సే" ముఖం గంటు పెట్టుకున్నాడు. మొహం పక్కకి తిప్పుకుని 'ఈ లేడీస్‌తో ఇదే ప్రాబ్లెం" అని ఏదో ఫైలుని విసురుగా పక్కన పెట్టాడు. "పదిహేనేళ్ళ మేరీడ్ లైఫ్‌లో నేనూ నా వైఫూ నాలుగేళ్ళు కూడా కలిసి బతకలేదు. అందులో మళ్లీ ఆవిడ చూలింత. బాలెంత..."

మగబుద్ధి. దుర్మార్గపు ఆలోచన. పెదవులు బిగిసినై. తమాయించుకొంది. లేచి నిలబడింది. అర్థం చేసుకున్నాడు.

"యూకెన్‌గో టేక్ కేర్ అఫ్ యువర్ సెక్షన్. వచ్చేనాడు అదే వస్తుంది. నీ.. ట్రా...న్స్...ఫ..ర్" అని చివరి పదాన్ని విరిచీ, వంకరగా మడిచీ దానిలో అదోలా వెటకారం దట్టించాడు.

మనసుగీ పెట్టింది. కనుగ్రుడ్డు మీద నీటితెర కమ్మింది. లేచి లైట్ వేసింది మమత.

ఫోన్ మ్రోగింది, రాఘవ!

మామూలు పరామర్శలు. ఆఫీసు కబుర్లు. బోలుమాటలు.

"చెప్పావా మీ బాస్‌కి?" డైలీ రిపోర్ట్ కావాలి రాఘవకి. పెగిలీ పెగలని గొంతుతో ఆ రోజు మధ్యాహ్నం జరిగిందంతా చెప్పింది. రాఘవ చిరాకుపడ్డాడు. ప్రపంచంలోని బాస్‌లందర్నీ కలిపి బూతులు తిట్టాడు. పనిలో పనిగా 'నువ్వో పెద్ద యూస్‌లెస్ ఫెలోవి" అన్నాడు. స్త్రీ పట్ల కపటత్వమే విలువ గలిగిన పితృస్వామ్య వ్యవస్థలో ఒక తునక! ఆ ఆధిపత్య ధోరణికి కొనసాగింపుగా, "నీ కసలు ఇక్కడికి రావాలనే సీరియస్‌నెస్ ఉంటేగా?' గట్టిగా అడగలేవు. నీళ్ళు నమిలితే ఎవరిస్తారు?" ఇదీ ముక్తాయింపు.

మమతకి అసలే తలనొప్పిగా ఉంది. రాఘవ మాటలకు తిక్కరేగింది. "అవును, నాకు చేతకాదు. అడ్డమైన వెధవల కాళ్ళు నేనెందుకు పట్టుకోవాలసలు?"అని. స్వరం పెంచి, "మీరే ఇక్కడికి ట్రై చెయ్యండి" అని ఫోన్ కట్ చేసింది.

"గోరంత సానుభూతీ లేదు. రవ్వంత బాధా లేదు నా పరిస్థితికి" అనుకుంది. మమతకి నీరసం ఆవహించింది. మొహమంతా చెమట పట్టింది. సోఫాలో అలాగే వెనక్కి వాలిపోయి, కళ్ళు మూసుకుంది.

ఆలోచన గతాన్ని కెలికింది.

రాఘవకీ, వాళ్ళ అమ్మానాన్నకీ అన్నతమ్ములిద్దరికీ, అక్కకీ తానంటే నిరాసక్తి. ఒక విధమైన చులకన. ఎగతాళి. వాళ్ళ దృష్టిలో తనకు ఉద్యోగినిననే అహం. వారి భావాలకు తగినట్లే జరుగుతూ వుంటాయి సంభవాలు. రాఘవ తమ్ముడి కొడుకు ఉపనయానికి తాను వెళ్ళలేదు. తనకు ఇయరెండ్ క్లోజింగ్ - బిజీ!' తన అత్తగారికి ఎపెండిసైటిస్ ఆపరేషన్. తాను ఢిల్లీలో ట్రైనింగ్‌లో ఉంది. ఆడబిడ్డ పిల్ల పెళ్ళి ఎంగేజ్‌మెంట్‌కి తనకే జ్వరం! ఈ కారణాలన్నీ తాను కల్పించుకున్నవి కావు కదా. అయినా దెప్పి పొడవటం. సమయం దొరికితే సూటిపోటీ మాటలు తన అసలు విచారం - రాఘవ కూడా అదే భావనని కడుపులో వుంచుకుని కావలించుకోవటం.

బాధ్యతకీ – అవసరానికీ మధ్య సంఘర్షణ వాళ్ళందరి వాంఛితాలకీ తన అనుకూల్యతకీ సంఘర్షణ!

మొహం తుడుచుకుని లేచింది. తొమ్మిదయింది.

వంట చేసుకోవాలనిపించలేదు.

హోటల్ కేసి నడిచింది.

❖ ❖ ❖

భోజనం చేసి తిరిగొచ్చింది మమత. ఇంటి తలుపు తాళం తీస్తుంటే మళ్ళీ రాఘవ ఫోన్. లోపలికొచ్చి కూర్చుంది.

"మాట్లాడుతుంటే ఫోన్ కట్ చేస్తావేమిటి?' ఫూలిష్‌నెస్" అని మొదలెట్టి. చేతికందిన రాళ్ళన్నీ మాటల్ని చేసి విసిరాడు. ఆ తర్వాత కొంచెం సౌమ్యంగా, 'రేపు ఆదివారం మా బాస్ ఆదిలక్ష్మి గారిని చూసొద్దాం. నువ్విక్కడికి రావాలి. కుంటి సాకులు చెప్పకు" అన్నాడు. బాస్ యముడు కళ్ళముందు మెదిలాడు.

సుడిగుండంలో మునక! అరణ్యమధ్యంలో రోదన! ఇదీ పరిస్థితి. "ఆడిట్...." గొణిగింది. సణిగింది.

"అవ్వన్నీ ఎప్పుడూ వుండేవే. వాడి చావు వాడిది. నువ్ వచ్చెయ్" అని. మరుక్షణం "సోమవారం సెలవు పెట్టి రావాలి తెలుసుగా" అన్నాడు, ఫోన్ కట్ అయింది.

ఆదివారం రాత్రి?... అవును... ఇద్దరికీ బయోలాజికల్ ఆర్ట్! మమతకి నవ్వొచ్చింది.

ఇల్లు సర్దుకొని బెడ్ మీద వాలింది.

యమకింకరుల్ని పక్కన పెట్టుకుని మాట్లాడుతున్నట్టుంది రాఘవ సంభాషణ. మొండిమనిషి, అన్నీ తాను అనుకున్నట్టు జరగాలి. అసలు నెల్లూరు పోస్టింగ్ వచ్చినప్పుడు, తాను ప్రమోషన్ వద్దనుకుని హైదరాబాద్‌లోనే వుండిపోతానంది. వీల్లేదని పట్టుబట్టాడు రాఘవ. ఇంట్లో పెద్ద కోల్డ్‌వార్. ఎడమొహం. పెడమొహం పీకలు తీసేసిన సన్నాయి బూరల్లా అక్కడొక్కరూ ఇక్కడొకరూ హాలుని అలంకరించేవారు! ఇప్పుడు? ట్రాన్స్‌ఫర్‌కి సీరియస్‌గా ప్రయత్నించటం లేదని అభియోగం, సొద్దు!

కోపం, ఉద్రేకం, తొందరపాటు! అమ్మా నాన్నాలకి చెప్తే – 'రిజైన్ చేసి కూచో' – సలహా. రిజైన్ చేయనిస్తాడా రాఘవ? స్టేటస్, ఇన్‌కమ్?' సరదాగా మాటవరకంటేనే 'రిజైన్ చేసిన తర్వాత, విడాకులిస్తా – జాగ్రత్త' అని అసలైన మనసునే విప్పిన ఘనుడు!

❖ ❖ ❖

తెలతెలవారుతుండగా హైదరాబాద్ చేరిది మమత.

ఆఫీసుల వ్యవహారాలే, సోమవారం సెలవు 'మేనేజ్' చేసిన వైనం చెప్పుకుంటూ కాఫీలు పూర్తిచేశారు. విశాఖలో పిల్లల సంగతులూ (సంభాషణలో) కదిలాయి.

భళ్ళున తెల్లారింది.

కరకరలాడుతున్నాడు సూర్యుడు.

స్నానాదికాలయిన తర్వాత హోటల్లో 'బ్రేక్‌ఫాస్ట్' చేసి ఆదిలక్ష్మిగారిల్లు చేరుకున్నారు.

హాల్లో కూర్చున్నారు. ఆమె లోపల్నుంచీ రావాలి. ఆదిలక్ష్మీగారి భర్త 'హిందూ' పత్రికని తిరగేస్తున్నాడు. వీళ్ళని పలకరించి వివరాలడిగాడు. చెప్పాడు రాఘవ. ఆయన తన గురించీ చెప్పుకున్నాడు. సెంట్రల్ గవర్నమెంట్‌లో పెద్ద హోదాగల అధికారి. పేరు నిత్యానంద్. ఉద్యోగం ఇప్పుడిక్కడే.

మౌనంలో కలిసిపోతున్నాయి నిమిషాలు. ఉన్నట్టుండి నిత్యానంద్‌గారు చిత్రంగా నవ్వసాగారు. అసలే అస్తిమితంగా కూర్చున్న రాఘవ, మమత విస్తుపోయారు. సరిగ్గా అప్పుడే ఆదిలక్ష్మి హాల్లోకొచ్చింది. భర్తను చూసి ఏవిటన్నట్లు కనుబొమలు ఎగరేసింది. రాఘవ, మమత ఆమెకి నమస్కరించారు.

నవ్వునాపుకుంటూ చెప్పారు. నిత్యానంద్‌గారు. "ఫన్నీ. భార్యకి ట్రాన్స్‌ఫర్ రాలేదని భర్త ఆత్మహత్య – న్యూస్ ఐటం! వెరీఫన్నీ" అని మళ్లీ మంద్రస్థాయిలో తన నవ్వుని కొనసాగించాడు.

"చెప్పండి" అన్నది ఆదిలక్ష్మి రాఘవ నుద్దేశించి, "నాకీ సంవత్సరం ప్రమోషన్ ఇచ్చారు మేమ్. మీరే కమిటీ ఛైర్మన్." మెహర్బానీ ఎత్తుగడ. ముఖప్రీతి మాట!

"యా... గుర్తుంది". "ఐ నీడ్ యువర్ బ్లెస్సింగ్స్ మేమ్. పోస్టింగ్‌లో మీరు హెల్ప్ చేయాలి" రాఘవ మొదలెట్టాడు. మమత అందుకుంది. ఇద్దరూ ఆత్మఘోషనంతా ఆమె ముందు క్రుమ్మరించారు. చివరికి "నాకు కూడా నెల్లూరు పోస్టింగ్ ఇప్పిస్తే...." నసిగాడు రాఘవ.

"ఓ.కే. కానివ్వండి. చూద్దాం" అని లేచింది ఆదిలక్ష్మి గోడగడియారం కేసి చూసింది.

అంగికం అర్థమైంది. ఇక మీరు వెళ్ళొచ్చు అన్న సూచన.

నమస్కారం చేసి సెలవు తీసుకున్నారు రాఘవ. మమత, పగలు చందానగర్‌లో అత్తగారిల్లూ, మియాపూర్‌లో ఆడనపడుచు ఇల్లూ – "విజిట్స్'. మోటర్‌బైక్ మీద ప్రయాణం ఒళ్ళంతా హూనం హూనం. మనసంతా గొర్రెలు పరిగెత్తిన పూలతోట.

యాంత్రికంగా ఒళ్ళు విరుపులూ, ఆవులింతలూ,. ఆత్మనిందా, పరనిందా!

రాత్రి –

అనుభవించలేకపోతున్న ఆనందాల్ని గురించిన సంభాషణ నిస్పృహతో మొదలై, నిష్ఠూరాలు దాటుకుని, కినుకలో ప్రవేశించి, కోపంలోకి పొంగి, మిగిలివున్న వివేకంలో కరిగి, చివరికి పబ్లిక్ సెక్టార్‌నీ, యాజమాన్యాన్నీ తిట్టి తిట్టి, శపించి, నీరసించి, అనక పరస్పర సానుభూతిలో తడిసింది!

ఎప్పుడో పొద్దుపోయిన తర్వాత –

పోయిన రోజుల్లోని 'స్వీట్ నథింగ్స్'కి మనసులో దోహదక్రియలు చేసుకుని, ఈనాటి, వెన్నెల తుంపుని పెదవుల మీదకి తెచ్చుకుని, రానున్న 'మంచి'ని ఉత్సహించుకుని – చూపుల్లో అనురాగ ప్రసరణం కావించుకున్నారు. కాస్సేపు ట్రాన్స్‌ఫర్ మరచిపోయారు. చేష్టలతో సువర్ణరేఖలు గీసుకున్నారు.

మనసులూ, దేహాలూ ఏకమైనై

❖ ❖ ❖

ఈసారి పోస్టింగ్స్‌లో పొరపాటేలమీ జరగలేదు. రాఘవని బెంగుళూరు వేశారు! మమతకి స్థానభ్రంశమేమీ లేదు! రాఘవ వెళ్ళి ఆదిలక్ష్మిగారికి ఆత్మరోదనం వినిపిస్తే,

'నా సంగతి చూడండి. నన్ను ముంబై వేశారు. నాహజ్బెండ్‌కి జమ్మూ పడింది" అంది- నోరెత్తకు అన్నట్టు!

భిక్షపతికి హైదరాబాద్ బదిలీ అయింది.

ఒకటో రెండుసార్లు మమత ఆయన కేబిన్‌లోకి నడవబోయి ఆగిపోయింది. స్వింగ్‌డోర్ పైనుంచీ కనిపిస్తూనే ఉంది. భిక్షపతి కొంకర్లు తిరిగినమొహం! అందులోనూ అది పెనం మీది మాడి మశానం అయిన గింజలా వుందిప్పుడు. ఆయన శ్రీమతి ఇప్పుడు పూనేలో వుంది మరి!

ఉద్యోగ పుస్తకం నిండా అర్థానుస్వారాలూ, పూర్ణానుస్వారాలే. అక్కడక్కడా ఉభయాక్షరాలు.

'డిఐజీ' గ్రూప్ ఎప్పుడూ అదృష్టవంతులే- లోకం దృష్టి! వాస్తవంలో ఎక్కువ చిరిగిన పేజీలే!

రాఘవ - ముందు చిందులేశాడు తర్వాత, కారాలూ మిరియాలూ నూరాడు. ఆ తర్వాత, చేతులు నలుపుకుంటూ యూనియన్ చుట్టూ తిరిగాడు. శుష్కప్రియాలూ, శూన్యహస్తాలూ మిగిలాయి. ఆదిలక్ష్మి మీది కోపాన్ని మమత మీదికి మళ్ళించాడు. సెల్‌ఫోన్ బిల్లు పెరిగిపోతూనే వుంది.

మమత వాళ్ళమ్మకి ఫోన్లో ఈ 'సోది' అంతా చెబితే. ఆవిడ మౌనంగానే విని? భర్తచేత అసలు మాట పలికించింది. "ఏది ఏమైనా - మమతా, ఈ ఏడాది పిల్లల్ని నెల్లూర్లోనో, బెంగుళూర్లోనో ఎడ్మిట్ చేసుకోండే!" అని. క్షణాల తర్వాత - కారణాన్ని మరోసారి గుర్తు చేశాడు. "నేను హార్ట్ పేషెంట్‌ని. మీ అమ్మకి 'గౌట్' ఎక్కువయింది తెలుసుగా" అని.

చెప్పలేక చెప్పలేక తనకున్న జ్ఞానాన్నంతా వాడుకుంటూ, అణుకువలో తడిసి ముద్దయి - ఈ విషయాలు చెప్పినా, రాఘవ - భార్య మీద అరిచాడు. అలిగాడు. నీలిగాడు. చివరికి 'బంధుత్వాలన్నీ ఇంతే. అవసరానికి ఆదుకోరెవ్వరూ' అనేశాడు. అత్తమామల నాలుగేళ్ళ సహాయమూ గాలికి తేలిపోయింది.

ఏడుపులూ, షష్టాష్టకాలూ, కొట్లాటలూ, యుద్ధాలూ, చర్చలూ జరిగి జరిగి,

కడకు 'రాజీ'లో చప్పబడినాయి. మమత రాజీనామా చేసేసింది! పిల్లలూ, ఆమే బెంగుళూరు చేరేరు. పిల్లల అడ్మిషన్స్ అయిపోయి. సెటిలైనారు.

నెలరోజులు గడిచేసరికి చాలా వార్తలు తెలిసినై. భిక్షపతి బదిలీ ఆర్డరు పూనే మారింది. నిత్యానంద్ ముంబైలో ఛార్జ్ తీసుకున్నాడు. సాధన సత్ఫలితాన్నిస్తుంది మరి! సా'ధన'లో చాలా అర్థాలూ, పద్ధతులూ వున్నాయి.

రాగమూ, తానమూ, పల్లవీ నేర్వని 'మధ్యమాగతి' పరిస్థితి ఎప్పుడైనా ఇంతే!

పతాక శీర్షిక చూసి వేదాంతి నవ్వు నవ్వుకోవటమే!

'చేసుకున్నవారికి చేసుకున్నంత' అనుకుంటూ ఇంట్లో నుంచీ బయటకి నడిచింది మమత. కలకివతల పడింది. మమతకివ్వాళ ఓ ప్రైవేట్ కాన్వెంట్‌లో ఇంటర్వ్యూ.

**–చినుకు మాసపత్రిక, జూలై, 2010**